తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

శుక్రవారం

04 సెప్టెంబర్ 2026


## సీఎం పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండకూడదు



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఈ నెల 4న నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన ఏఎస్ఎల్ సమావేశంలో పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు.

హెలిప్యాడ్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమాన్ ఆలయం మీదుగా సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల వరకు రహదారులు, పారిశుద్ధ్యం, బ్యారికేడింగ్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట రోడ్డు మరమ్మతులు, ఫిల్లింగ్ పనులను వెంటనే చేపట్టాలని, రహదారుల వెంట పటిష్ట బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు, చెత్త తొలగింపు, పరిసరాల పరిశుభ్రతను రాత్రివేళల్లోనైనా పూర్తి చేసి ఉదయానికి సిద్ధంగా ఉంచాలన్నారు.

ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున జన సమూహాల నియంత్రణ, ట్రాఫిక్, యాక్సెస్ కంట్రోల్, భద్రతా చర్యలను ముందస్తుగా చేపట్టాలని తెలిపారు. ముఖ్య ప్రాంతాల్లో పాయింట్ అధికారులను నియమించి నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు, తాగునీరు, ఆహార సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, ఆహార నాణ్యతపై సివిల్ సప్లైస్, ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా...**

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వాహనం సమీపానికి అనుమతి లేని వ్యక్తులు రాకుండా భద్రతా బ్యారికేడ్లు, యాక్సెస్ కంట్రోల్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు ప్రవేశ మార్గాలు, కేటాయించిన ప్రాంతాలను ముందుగానే నిర్దేశించాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్, ఇంటెలిజెన్స్ అధికారులు హెలిప్యాడ్, డిగ్రీ కళాశాల, గురుకుల బాలికల పాఠశాల/కళాశాల నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం: హరీశ్‌రావు

- గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద మాజీ మంత్రికి బీఆర్ఎస్ శ్రేణుల ఘన స్వాగతం



**గుమ్మడిదల, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ శాసనసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీ లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు నిరసన కార్యక్రమాలకు వెళ్తున్న హరీశ్‌రావుకు గురువారం గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో హరీశ్‌రావు మాట్లాడారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రైతు బీమా, రైతుబంధు పథకాల విషయంలోనూ రైతులకు అన్యాయం జరుగుతోందని హరీశ్‌రావు విమర్శించారు. దేవుళ్లపై ఒట్లు పెట్టి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో సుమారు 300 రోజులు ఢిల్లీ పర్యటనలకే పరిమితమైందని ఆయన విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించామని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు మందగించాయని అన్నారు.

రాష్ట్రంలోని రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు అన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్ల పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి రహదారుల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు రాజశేఖర్, మురళి, చక్రపాణి, సంజీవరెడ్డి, కిషన్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అనంతారం సర్పంచ్ శ్రీను, ఉపసర్పంచ్ యాదిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మంగయ్య, సూర్యనారాయణ, గోపాల్, సాయిరెడ్డి, కౌశిక్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలు

- ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాములో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్లు కట్టుదిట్టమైన భద్రత మధ్య భద్రపరిచినట్లు జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు.

గురువారం త్రైమాసిక తనిఖీలో భాగంగా రాజ కీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగాఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను తనిఖీ చేసి, అక్కడ భద్రపరిచిన యంత్రాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈవీఎంలు, వీవీప్యాట్లకు సంబంధించిన రికార్డులు, సీల్స్ పరిస్థితి, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా, పోలీస్ బందోబస్తు, భద్రతా సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. గోదాములోని ఒక ఫైర్ సేఫ్టీ పరికరం కాలప రిమితి ముగిసినట్లు గుర్తించిన కలెక్టర్, వెంటనే దానిని మార్చాలని సంబంధిత అధికారులను ఆదే శించగా, పరికరాన్ని అధికారులు ఆ పరికరాన్ని అప్పటికప్పుడే మార్చారు.

ఎన్నికల సంఘం మార్గదర్శ కాలకు అనుగుణంగా ఈవీ ఎంలు, వీవీప్యాట్లను అత్యంత భద్రంగా సంరక్షించాలని అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రత, నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి,సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు



సక్రమంగా నిర్వహించాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రమేష్, ఎన్నికల విభాగం అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్ శంకర్, సంబంధిత రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కుంటే నా ప్రాణం కానీ...

- 70 లక్షలిచ్చి ఖబ్జా చేసుకొండిలి
- బేరసారాలు పూర్తి చేసుకున్న అధికార పార్టీ నాయకుడు
- బయానగా రూ.20 లక్షలు
- జుట్టయ్యకుంట కట్ట సదరం చేసే బాధ్యత ఆ నాయకుడిదే



8లో..

**బిజినపల్లి, సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** కుంట మీద ఆధారపడి గత 50 ఏండ్లుగా వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నాం, అలాంటి ఈ కుంటే నా ప్రాణం అని, దాని జోలికి ఎవరూ పోయేది లేదు అని ప్రచారం చేసుకుంటూనే రూ.70 లక్షలకు బేరం పెట్టి, బయానాగ రూ.20 లక్షలు తీసుకున్నాడు అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు. ఇది ఎక్కడో కాదు. బిజినపల్లీ మండల కేంద్రంలోని జుట్టయ్య కుంట బాగోతం.

## బిజినేపల్లి విద్యుత్ శాఖలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు




**బిజినేపల్లి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు విద్యుత్ సమస్యలు మరింత కష్టాలు తెచ్చిపెడుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై లైన్‌మెన్లను సంప్రదిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొందరు డబ్బులు తీసుకుంటేనే పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు.

బిజినేపల్లితో పాటు పరిసర గ్రామాల్లో కొందరు లైన్‌మెన్లు ఏఈ ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదని, స్థానిక రాజకీయాలను ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండల కేంద్రానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలపై బిజినేపల్లి లైన్‌మెన్‌కు ఫోన్ చేసినా స్పందించకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, స్పందించని లైన్‌మెన్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR)లో భాగంగా నిర్వహించనున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను అర్హత కలిగిన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ కోరారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో సెప్టెంబర్ 5, 6 తేదీల్లో మొదటి దశ, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో రెండో దశ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్లు ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవడంతో పాటు, పేరు నమోదు, తొలగింపు లేదా వివరాల్లో మార్పులు, సవరణలు అవసరమైతే ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ప్రత్యేక ప్రచార రోజుల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ అధికారులు ( బిఎల్ఓలు), బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఎలు) అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించి తప్పులు ఉంటే నిర్ణీత విధానంలో సవరణలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరు జాబితాలో తన వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని ఆయన కోరారు.

# రైతులకు అండగా బీఆర్ఎస్...

- సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కౌడిపల్లిలో నిరసన కార్యక్రమం
- ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



**కౌడిపల్లి సెప్టెంబర్ 03, (జనంసాక్షి):** మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అండగా నిలుస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌడిపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సారా రామాగౌడ్, తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల సమస్యలపై ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాట్లాడుతూ... ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ నిరసన వ్యక్తం చేశారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, రైతు బీమా,



యూరియా–ఎరువుల కొరత, ధాన్యం కొనుగోళ్లు, సాగునీటి సమస్యలతో పాటు రైతులు ఎదుర్కొం టున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.

**ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...** రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల ఇలాగే మొండి వైఖరి చూపిస్తే వచ్చే రెండేళ్లలో బిఆర్ఎస్ జండా ఎగరడం ఖాయం మీరు బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కెసిఆర్, ని కించపరచడం కాదు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాని మీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో మీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పి చిత్తుచిత్తుగా ఓడించి బిఆర్ఎస్ జండాని ఎగరవేయడం ఖాయమని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు మరే ఇతర ప్రభుత్వంతో సాధ్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవాలి

- నర్సాపూర్‌లో BLOలతో సమీక్ష.. వార్డుల్లో హియరింగ్ నిర్వహణ



**నర్సాపూర్ సెప్టెంబర్ 3 (జనంసాక్షి):**
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నర్సాపూర్ పురపాలక సంఘం కార్యాలయంలో ఏఈఆర్ఓ/కమిషనర్ చెరుకు సాయికుమార్ ఆధ్వర్యంలో గురువారం బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని 6, 7వ వార్డులు (పీఎస్ నంబర్లు 285, 286)లో ఓటరు జాబితాలో తప్పుల సవరణకు సంబంధించి హియరింగ్ నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పట్టణ ప్రజలు పరిశీలించాలని సూచించారు. జాబితాలో పేర్లు, వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటి సవరణ కోసం సంబంధిత వార్డు సభల్లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మొహియుద్దీన్, వార్డు అధికారి రాములు, గ్రామ పాలన అధికారులు దుర్గయ్య, ఆంజనేయులు, బీఎల్ఓలు, పట్టణ ప్రముఖులు, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్ మండల ఉప తహసిల్దార్‌గా మల్లికార్జున స్వామి

### నేడు విధుల్లో చేరిక



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 03, (జనంసాక్షి):** న్యాల్‌కల్ మండల ఉప తహసిల్దార్ గా మల్లికార్జున స్వామి నియమితులయ్యారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు గురువారం మధ్యాహ్నం తహసిల్దార్ ప్రభువుల సమక్షంలో విధుల్లో చేరారు. ఇదివరకు మం॰ల ఉప తహసిల్దార్‌గా విధులు నిర్వహించిన రాజిరెడ్డి నారాయణఖేడ్ పట్టణంలోని సివిల్ సప్లై (పౌరసరఫరాల శాఖ)కు బదిలీ అయ్యారు. జిన్నారం మండల ఉప తహసిల్దార్ గా విధులు నిర్వహించిన మల్లికార్జున స్వామి బదిలీపై న్యాల్ కల్ మండల ఉప తహసిల్దార్ గా విధుల్లో చేరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనపై సదాశివపేటలో సంబరాలు



**సదాశివపేట, సెప్టెంబర్ 3(జనంసాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సదాశివపేటలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదేశాలతో డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి నాయకత్వంలో, పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో 70 వేల ఉద్యోగాలు కల్పించిందని, రేషన్ కార్డులు పంపిణీ చేసి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మంత్రి వాకిటి శ్రీహరి కృషి అభినందనీయం: కాంగ్రెస్ నేతలు



**మక్తల్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** జూరాల ప్రాజెక్టు ముంపు గ్రామాల బాధితుల ఏళ్లనాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముంపు గ్రామాల బాధితులు అన్నారు. గురువారం మక్తల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంగంబండ, ఉజ్జెల్లి, నేరెడ్‌గొం, భూత్పూర్, అనుగొండ, అంకెన్‌పల్లి, దాధన్‌పల్లి, గడ్డంపల్లి తదితర గ్రామాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.

గతంలో సరైన పరిహారం, పునరావాసం లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సమస్యలను గుర్తించిన మంత్రి శ్రీహరి ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రితో సమన్వయం చేసి భారీగా నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. సంగంబండ రిజర్వాయర్ పరిధి పనులు, పరిహారం కోసం రూ.12 కోట్లు, ఉజ్జెల్లి అభివృద్ధికి రూ.6 కోట్లు, అనుగొండ, అంకెన్‌పల్లి, దాధన్‌పల్లి పునరావాసం, మౌలిక వసతులకు రూ.100 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వివరించారు.

నియోజకవర్గంలో రూ.1,800 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. నారాయణపేట–మక్తల్ 6 లైన్ల రహదారి, కాలువల పూడికతీత, బ్రిడ్జిలు, బీటీ, సీసీ రోడ్లు, ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాలతో పాటు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నేతలపై ధ్వజం...**

దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు నిర్వాసితుల సమస్యలను పట్టించుకోకుండా ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మంత్రిపై అనవసర విమర్శలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా పాలనకు 1000 రోజులు




**కోహెడ, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కోహెడ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి టపాసులు పేల్చారు.

ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. చేయూత, వితంతు పించన్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, పర్యాటక రంగాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. తంగళ్లపల్లిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, గ్రామాల్లో సీసీ, డబుల్ బీటీ రోడ్లు, హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు పరిహారం అందిస్తూ సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భూభారతి రీ సర్వే కార్యక్రమం ప్రారంభం

- నర్సంపల్లిలో ప్రారంభించిన అధికారులు



**ఉర్కొండ, సెప్టెంబర్ 03,(జనంసాక్షి);** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రీ సర్వే కార్యక్రమం ఊరుకొండ మండలంలోని నర్సంపల్లి గ్రామన్నీ పైలెట్ గ్రామంలో నిర్ణయించడం జరిగింది.
గురువారం రెవెన్యూ అధికారులు గ్రామంలో రీ సర్వే పనులను లాంఛనంగా ప్రారంభించారు. భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు తమ భూముల పట్టా పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు అందుబాటులో ఉంచుకోవాలని, సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసమే ఈ రీ సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## గురు రవిదాస్ చిత్రపట అవమానంపై బీజేపీ ఆగ్రహం



**బెజ్జంకి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ చిత్రపటంపై నల్లరంగు చల్లిన ఘటనను నిరసిస్తూ బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు మాట్లాడుతూ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గురు రవిదాస్ సమానత్వం, సామాజిక న్యాయాన్ని చాటిచెప్పిన మహనీయుడని, ఆయన చిత్రపటాన్ని అవమానించడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.

## పంచాయతీ రాజ్ శాఖాధికారులతో జడ్పీ సీఈఓ సమీక్ష

- అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 03, (జనంసాక్షి):** మండల పంచాయత్ రాజ్ శాఖాధికారులతో జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, అదనపు డిఆర్డీఓ బాలరాజు, ఏపీడి పూజ, తదితరులు మండలంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇన్చార్జి ఎంపీడీఓ నరేష్ అధ్యక్షతన సమీక్ష సమావేశం కొనసాగింది. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక పురోగతి, శ్రీ శక్తి భవనాల నిర్మాణాలు, జలసిరి పనుల పురోగతి, వ్యవసాయ క్షేత్ర చెరువుల అభివృద్ధి, గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సకాలంలో పనులను పూర్తి చేయడం, నాణ్యత ప్రమాణాలను పాటించడం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ, తదితర అంశాలపై అంశాల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పిఆర్ ఏఈ మహేష్, ఏపీఓ, ఏపీఎం, టిఏలు, ఎఫ్ఏలు, సీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# మేఘారెడ్డిపై ఆరోపణలకు ఆధారాలేవి?

- ముందు మీ భూ వ్యవహారాలపై సమాధానం చెప్పండి: కాంగ్రెస్ నేతలు



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఆరోపణల్లో నిజం ఉంటే ఆధారాలతో ప్రజల ముందుకు రావాలని, లేకుంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మేఘారెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ వ్యవహారాలను ఆధారాలతో ప్రజల ముందుంచుతామని హెచ్చరించారు. పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామ శివారులోని భూముల వ్యవహారంపై గురువారం గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు మీడియాతో మాట్లాడారు. దానయ్యకు చెందిన భూమిని మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి ద్వారా మేఘారెడ్డి కొనుగోలు చేశారని, అనంతరం అదే భూమిని ఇతరులకు విక్రయించడంలోనూ రఘుపతిరెడ్డి పాత్ర ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా జరిగిందని నిరూపిస్తే బాధిత రైతులకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే గతంలోనే చెప్పారని గుర్తుచేశారు.

**నిరంజన్‌రెడ్డి భూ వ్యవహారాలపై ప్రశ్నలు...**

మేఘారెడ్డిపై ఆరోపణలు చేసే ముందు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తన హయాంలో జరిగిన భూ లావాదేవీలపై సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. వెల్టూరు శివారులోని 345, 446 సర్వే నంబర్లకు సంబంధించి మాజీ మంత్రి కుటుంబ సభ్యుల పేర్లతో జరిగిన లావాదేవీలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. కుమ్మరి నాగన్న నుంచి నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేరుతో భూమి కొనుగోలు, గిఫ్ట్ డీడ్ తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని కోరారు.
మేఘారెడ్డి దళితుల భూములను అక్రమంగా ఇతరులకు అప్పగించారనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని కాంగ్రెస్ నేతలు సవాల్ చేశారు. ధరణి, భూ వివాదాలు, భూసేకరణ సమయంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై అప్పటి ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రాజకీయంగా మేఘారెడ్డిని ఎదుర్కోలేక వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆరోపణలు కొనసాగిస్తే బీఆర్ఎస్ హయాంలోని భూ వ్యవహారాలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్తామని హెచ్చరించారు.

## మండల నూతన ఎంపీడీవోగా నరసింహులు



**వీపనగండ్ల, సెప్టెంబర్ 4(జనంసాక్షి):**
వీపనగండ్ల మండల నూతన ఎంపీడీవోగా నరసింహులు బాధ్యతలు చేపట్టారు.గతంలో పెంట్లవెల్లి మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిలో భాగంగా ఎంపీడీవోగా అధికారులు నియమించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి విధులు నిర్వహిస్తానని అన్నారు.

## మహాసభలను జయప్రదం చేయండి



**బిజినేపల్లి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం జనం కొరకు,జాతి కొరకు అంటూ ఏర్పడిన తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం 3వ మహాసభలను జయప్రదం చేయాలని గురువారంమండల కేంద్రంలో గల అంబేద్కర్ చౌరస్తాలో కరపత్రాలను విడుదల చేయడం జరిగినది. ఈ కార్యక్రమం నాగర్కర్నూల్ జిల్లా కో-కన్వీనర్ పీ.వెంకటేష్ , దాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో బిజినపల్లి మండల రిపోర్టర్లు మాసయ్య, మహేష్, బంగారయ్య, శ్రావణ్, నరసింహ, వివిధ పత్రికలో రిపోర్టర్లు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

- డ్రైవర్‌పై కేసు నమోదు - ఎస్ఐ కురుమూర్తి

**కల్వకుర్తి,సెప్టెంబర్ 3,(జనంసాక్షి):** తాండ్ర గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వెల్దండ మండలం సిలోని బావి తాండ నుంచి ఓ హోమిని కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సమాచారం అందుకున్న





ఎస్ఐ కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా తరలించినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఖిల్లాలో మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య



**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శివ (21) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది.
వివరాల్లోకి వెళితే.. కుమ్మరి శేషమ్మ, లేట్ తిరుపతయ్య దంపతుల చిన్న కుమారుడైన శివ డెకరేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆగస్టు 31న హైదరాబాద్ లో ఉంటున్న తన తల్లి శేషమ్మతో రాత్రి సుమారు 9.30 ఫోన్‌లో మాట్లాడాడు. అనంతరం అదే రాత్రి 11 గంటల సమయంలో గంగారం గ్రామానికి చెందిన తన మేనమామ సాయిలుకు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పి ఫోన్ కట్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.
దీంతో అనుమానం వచ్చిన మేనమామ సాయిలు విషయాన్ని శివ తల్లి శేషమ్మకు తెలియజేశారు. మరుసటి రోజు శివకు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో, స్థానికుడు తోక రవిని ఇంటికి వెళ్లి చూడమని కోరారు. రవి ఇంటికి వెళ్లి చూడగా శివ మృతి చెంది ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. తల్లి శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

# గ్రామ సభల్లో సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ

**కొల్చారం, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశాల మేరకు కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. పోతంశెట్టిపల్లి, కొంగోడు, నాయిని జలాల్‌పూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో నర్సాపూర్ ఆర్డీఓ రామకృష్ణ, తహసిల్దార్ శ్రీనివాసచారి ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలు, ఓటరు



జాబితాల్లో పేర్లకు సంబంధించిన ఇబ్బందులు, గ్రామపంచాయతీ సమస్యలను గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆర్డీఓ సూచించారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేస్తే నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు, గ్రామస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**ఊర చెరువు కబ్జాపై ఫిర్యాదు...**

నాయిని జలాల్‌పూర్ గ్రామసభలో ఊర చెరువు భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు ఆర్డీఓ, తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. చెరువు భూమిలో కొందరు వరి నాట్లు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించి నిబంధనల ప్రకారం తక్షణమే చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.
గ్రామసభలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే వేదికలుగా ఉపయోగపడాలని అధికారులు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ సుమలత, జీపీఓ పద్మ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తారా.. గద్దె దిగుతారా?

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి
- 420 హామీలు, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు

**ఖిల్లా ఘనపురం, 03, సెప్టెంబర్, (జనంసాక్షి):** ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు.

గురువారం మండల కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నిరసన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అబద్ధాలు చెప్పడం అలవాటుగా మారిందని, ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత ఇవ్వకుండా మాయ మాటలు చెప్పి కాలం గడుపుతున్నారని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు, రైతు బీమా, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు, సాగునీటి వసతుల కల్పన, ఆసరా పింఛన్లు, కంటి వెలుగు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు నిరంజన్ రెడ్డి గుర్తుచేశారు. ప్రజలకు ఉపయోగపడే పలు పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపించామని అన్నారు, ప్రస్తుత కాంగ్రెస్ లో చాలామణి అవుతున్న నాయకులు

ఎన్నికల సమయంలో 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో



ప్రజలకు హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే , వాటి అమలులో ప్రభుత్వం తీవ్ర విఫలమైందని ఆయన ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమాధానం చెబుతారని, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని, గత పదేళ్ల పాలన కంటే మరింత మెరుగైన పరిపాలన అందిస్తామని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ జిల్లా మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ పి. కృష్ణ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, మాన్య నాయక్, ఆంజనేయులు గౌడ్, మన్యం గౌడ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షం ఫామ్‌హౌస్‌లో.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గుండెల్లో! - అరేళ్ల యాదయ్య

**బాలానగర్, సెప్టెంబర్ 03(జనంసాక్షి):** వెయ్యి రోజులుగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమైతే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వెయ్యి రోజులుగా ప్రజల మధ్య ఉంటూ, ప్రజల కోసం పనిచేస్తోందని బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ అరేళ్ల యాదయ్య అన్నారు.



బాలానగర్ మండల కేంద్రంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకుండా వెయ్యి రోజుల కాలంలో జీతభత్యాల రూపంలో సుమారు రూ.22.24 కోట్ల ప్రజాధనం తీసుకున్నారని ఆరోపించారు.

వెయ్యి రోజులు ఇంట్లో పడుకున్న కేసీఆర్ కు.. వెయ్యి రోజులు ప్రజల కోసం అహర్నిశలు పనిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదేనని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాకపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం సచివాలయం నుంచి పల్లె వరకు అభివృద్ధిని, సంక్షేమాన్ని తీసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూడలేక బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఫామ్‌హౌస్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ప్రజా పాలననే ప్రజలు కోరుకుంటున్నారని అరేళ్ల యాదయ్య పేర్కొన్నారు.

# బీసీ మంత్రుల జోలికొస్తే రాష్ట్రం అగ్నిగుండమే

- బీసీ, ప్రజా సంఘాల హెచ్చరిక

**జడ్చర్ల, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** బీసీ ప్రజాప్రతినిధులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణ యాదవ్, రజక సంఘం జాతీయ అధ్యక్షుడు నడిమింటి శ్రీనివాసులు హెచ్చరించారు.



గురువారం జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తన కూతురి వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టమైన వివరణ ఇచ్చిన, ఆమెను మంత్రి పదవి నుంచి తొలగించడం వెనుక బీసీ నేతలను రాజకీయంగా అణచివేసే కుట్ర ఉందన్నారు. ముఖ్యమంత్రిపై అగ్రకుల నేతలు విమర్శలు చేసినప్పుడు స్పందించని ప్రభుత్వం, బీసీ నేతలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదన్నారు. సీఎం, ఆయన సోదరులపై వస్తున్న భూ ఆక్రమణల ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచించి కొండా సురేఖను మంత్రిగా కొనసాగించకపోతే, రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి రాజకీయ పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ, ప్రజాసంఘాల నాయకులు సురభి విజయ్ కుమార్, బదనమోని వెంకటేష్, శివశంకర్, ప్లంబర్ శ్రీనివాస్, రోహిత్, బిక్ష నాయక్, చెన్న కేశవులు, శ్రీనివాస్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కండక్టర్ పై

# అసభ్య రాతలు.. గద్వాల డిపోలో నిరసన

**గద్వాల్, సెప్టెంబర్ 3(జనంసాక్షి):** గద్వాల్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్ ను లక్ష్యంగా చేసుకుని ఒక రిపోర్టర్ అత్యంత అసభ్యకరంగా, అవమానకరంగా వార్త రాయడాన్ని నిరసిస్తూ కార్మికులు ధర్నా చేశారు.డిపో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి డిపో గేటు వద్ద నిరసన తెలిపారు.



ఒక మహిళా ఉద్యోగి అని కూడా చూడకుండా ఆమె మనోభావాలు దెబ్బతినేలా, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్య అని ఖండించారు.ప్రజా రవాణా వ్యవస్థలో మహిళా ఉద్యోగులు ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని, వారిని గౌరవించాల్సింది పోయి ఇలాంటి రాతలు రాయడం బాధ్యతారాహిత్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు రాతలతో మహిళా ఉద్యోగుల ధైర్యాన్ని దెబ్బతీయలేరని అన్నారు. సదరు రిపోర్టర్ పై చర్యలు తీసుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో డిపో కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెమలి హత్య కేసులో ముగ్గురిపై కేసు

**ఎఫ్ ఆర్ఓ దివ్య**

**నర్సాపూర్, సెప్టెంబరు 3 (జనంసాక్షి):** నర్సాపూర్ మండలం చిప్పల్తుర్తి గ్రామ శివారులోని ఆయానా ఫార్మ్లో నెమలిని హతమార్చిన ఘటనపై ముగ్గురు వ్యక్తులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 కింద గురువారం కేసు నమోదు చేసినట్లు ఎఫ్ ఆర్ఓ దివ్య తెలిపారు.



**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...**

ఈ కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఆమె వెల్లడించారు. వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. వన్యప్రాణుల వేటకు పాల్పడి పర్యావరణ సమతుల్యతను, ఆహారపు గొలుసును దెబ్బతీయవద్దని ప్రజలకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

# పాత బస్సు రూటును పునరుద్ధరించాలి

- ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం అందజేత

**ఉర్కొండ, సెప్టెంబర్ 03, (జనంసాక్షి);**

కల్వకుర్తి నుండి వెల్జాల్ వరకు గల పాత బస్సు రూటును పునరుద్ధరించాలని కోరుతూ కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ శాలినినీ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చెరుకు మణికంఠ, బీసీ నాయకులు అజయ్ కౌండిన్య, ప్రవీణ్ చారి తదితరులు గురువారం రోజు మర్యాదపూర్వకముగా కలిసి వినతి పత్రం సమర్పించారు.



డీఎం శాలిని సానుకూలంగా స్పందించి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# జీవో 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల రాస్తారోకో

**సిద్దిపేట టు హనుమకొండ జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు**

**రోడ్డుపై బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపిన విద్యార్థులు**

**నంగునూరు, సెప్టెంబర్ 3(జనంసాక్షి):** జీవో 97ను రద్దు చేయాలని రాజగోపాల్పేట పాలిటెక్నిక్ విద్యార్థులు గురువారం రోజు సిద్దిపేట టు హనుమకొండ జాతీయ రహదారిపై ము శీడ్రాయి గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా, స్టేజి వద్ద పెద్ద ఎత్తున రాస్తారోకో, మానవహారం, నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు విద్యా అవకాశాలు తమకు సంబంధించిన సమస్యలతో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు వల్ల విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి అవతరణ రద్దు చేయాలని కోరారు తమ న్యాయమాలు పరిష్కరించే వరకు



ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయికు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న రాజగోపాల్ పేట ఎస్ఐ వివేక్ పోలీస్ సిబ్బంది, అక్కడికి చేరుకొని విద్యార్థులకు నచ్చచెప్పి, రాస్తారోకొను విరమింప చేశారు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి... అమీన్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

**అమీన్పూర్, సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధారాణి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అమీన్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల నుండి అంబేద్కర్ విగ్రహం వరకు అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశధర్ రెడ్డి, బీరంగూడ శ్రీ భ్రమరాంబమల్లికార్జున స్వామి దేవాలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దండు రమేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ మన్నె రవీందర్, దేవనాదం, యూత్ కాంగ్రెస్ మండల




అధ్యక్షుడు నరేష్, నవీన్, శ్రీనివాస్ యాదవ్, బీరంగుడా దేవాలయ సభ్యులు, మలేష్ యాదవ్, శ్రీనివాస్, దీపక్, లక్ష్మణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రకాష్, విజయ్, మహేష్, చుక్క రెడ్డి, కృష్ణ, సురేష్, శ్రీనివాస్, మల్ల రావు, సాయి, ప్రవీణ్, శ్రీకాంత్ రెడ్డి, రామ్ చెద్ర రెడ్డి, కె ఎస్ జి యువసేన సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్య ఖురాన్ సర్వ మానవాళికి మార్గదర్శకం - మౌలానా జియా ఉర్ రహమాన్

• ప్రవక్త సూక్తులు ప్రతి ఒక్కరు ఆచరించాలి



**ఆత్మకూర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** దివ్య ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ముస్లిం నిత్యం ఖురాన్ పఠనం చేయాలని మదర్సా ఈమాదుల్ ఉలుమ్ ప్రిన్సిపల్ మౌలానా జియా ఉర్ రహమాన్, హెడ్మాస్టర్ షేక్ రఫీయుద్దీన్ అన్నారు. గురువారం ఆత్మకూర్ పట్టణంలోని అరబ్బీ పాఠశాలలో దివ్య ఖురాన్ పఠనం పూర్తి చేసిన హాఫీజ్ సయ్యద్ మెహబూబ్ ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఉబేద్ ఉర్ రహమాన్ తమీమ్, ముక్తార్, సల్మాన్, అఫ్రిది, స్థానికులు ఖాజా, మహమ్మద్, సయ్యద్, గౌస్, ఇలియాస్, ఫెరోజ్, ఖాజా హుస్సేన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. పంపిణీని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ నరేష్ కుమార్



**ఆత్మకూర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** ఆత్మకూరు మున్సిపాలిటీలో ఎస్.ఐ.ఆర్ పంపిణీని మున్సిపల్ కమిషనర్ ఏ.నరేష్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసు అందుకున్న ప్రతి వ్యక్తి తమకు కేటాయించిన విచారణ తేదీన సంబంధిత నోటీసులో పేర్కొన్న పత్రాలు, ఆధారాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. నోటీసులు అందుకున్న వ్యక్తుల వివరాలను, సంబంధిత రికార్డులు, పత్రాలను పరిశీలించారు. నోటీసులు అందిన వారు విచారణ తేదీన తప్పక హాజరుకావాలని కోరారు. ప్రజలు బీఎల్ఓలకు సహకరించి పత్రాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నిధులు కేటాయించాలి - అజయ్ డిమాండ్



**ఆత్మకూర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** 1000 రోజుల పరిపాలనలో ఆరు గ్యారంటీల అమలు ఎక్కడని, వెంటనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నిధులు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని గుంటిపల్లిలో కూలీలతో ఆయన మాట్లాడుతూ భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12,000 చొప్పున అందిస్తామని చెప్పి తీరా కేవలం ఒక విడత మాత్రమే రూ.6,000 ఇచ్చి ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడం సరికాదని విమర్శించారు. అదేవిధంగా ఈ నెల 15వ తేదీ వరకు పెన్షన్లకు దరఖాస్తు పెట్టుకోవాలని సూచించిన రాష్ట్ర ప్రభుత్వం, 57 సంవత్సరాలు దాటిన వృద్ధులకు కొత్తగా పెన్షన్ కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు.
వెంటనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నిధులు కేటాయించడంతో పాటు వృద్ధులకు కొత్త పెన్షన్లు అప్లై చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.
అలాగే గ్రామీణ ప్రాంతాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించాలని, గుడిసెలు వేసుకున్న పేదలకు, బేస్మెంట్ లెవల్ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే రెండో విడత కింద ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.
గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ రచ్చబండ ఇళ్లు వచ్చిన వారికి ప్రస్తుత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు.
మే, జూన్, జూలై, ఆగస్టు నెలల్లో పనిచేసిన ఉపాధి కూలీలకు పెండింగ్ లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. చేయూత పెన్షన్లను రెట్టింపు చేస్తామన్న హామీ కూడా అమలు కావడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పోలన్న, కే. తిరుపతన్న, గడ్డం వెంకటన్న, హనుమంతు, గట్టన్న, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమందడి-వనపర్తి రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** పెద్దమందడి మండల కేంద్రం నుంచి వనపర్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పెద్దమందడి మండల యూనిట్ ఆధ్వర్యంలో గురువారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రహదారి ఏళ్లుగా శిథిలావస్థకు చేరి పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం వనపర్తికి రాకపోకలు సాగిస్తుండటంతో అధ్వానంగా ఉన్న రహదారి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
రహదారి అభివృద్ధికి గతంలో ప్రభుత్వం సుమారు రూ.40 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ముఖ్యమంత్రి, మంత్రులు పలుమార్లు శంకుస్థాపనలు చేసినా పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. టెక్నికల్ సమస్యల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుతం తిరిగి ప్రారంభించామని అధికారులు చెబుతున్నప్పటికీ గతంలో పలుమార్లు పనులు నిలిచిపోవడంతో ప్రజల్లో నమ్మకం లేదన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే చొరవ తీసుకుని పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కోరారు.

**పాదయాత్రకు నిరంజన్‌రెడ్డి సంఘీభావం...**

బీఆర్ఎస్ పాదయాత్రకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కొంతదూరం నాయకులతో కలిసి నడిచారు. పెద్దమందడి–వనపర్తి రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, పెద్దమందడి మండల నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో హామీలు నిలబెట్టుకోవాలి

### 50 శాతం ఫిట్‌మెంట్, ఓపీఎస్ అమలు చేయాలి: ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్ మండలం మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆదరాజుపల్లి మధుసూదన్ శర్మ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయాలని తాము కోరుతున్నామని తెలిపారు. నవంబర్ 1న 50 వేల మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించామని, త్వరలో మెరుగైన పీఆర్సీ ప్రకటించి సీపీఎస్ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడు మధుసూదన్ శర్మ నేటి ఉపాధ్యాయులకు ఆదర్శమని, 16 ఏళ్లపాటు పాఠశాలలో పనిచేస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. పీఆర్టీయూ–టీఎస్ అధికార ప్రతినిధి వంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగుల అన్ని బెనిఫిట్లను నెల రోజుల్లోగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మధుసూదన్ శర్మ దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకంతో అదనపు ఆదాయం

• వట్టిపల్లిలో ఉచిత పండ్ల మొక్కల పంపిణీ



**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):**
సాంప్రదాయ పంటలతో పాటు పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించుకోవడం ద్వారా రైతులు దీర్ఘకాలికంగా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి యు. వసంతరావు తెలిపారు. జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన రైతు నాగభూషణం వ్యవసాయ పొలం వద్ద గురువారం మారీ సంస్థ ఆధ్వర్యంలో, సే ట్రీస్ సంస్థ సహకారంతో ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణలో భాగంగా పండ్ల తోటల సాగు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పండ్ల మొక్క లను నాటిన అనంతరం వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మొక్కలకు సకాలంలో నీరు అందించడంతో పాటు సేంద్రియ ఎరువులు, అవసరమైన పోషకాలు అందించాలని సూచించారు. కాగా రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను అందిస్తూ, పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తున్న మ్యారి, సే ట్రీస్ సంస్థల సేవలను అభినందించారు. కార్యక్రమంలో మారీ సంస్థ ప్రతినిధులు రాజేందర్, రాజు సే ట్రీస్ సంస్థ ప్రతినిధులు, నారాయణ సిబ్బంది, వట్టిపల్లి ఉపసర్పంచ్ నాగరాజు, మాందాపూర్ ఉప సర్పంచ్ రాజ్ కుమార్, గ్రామ రైతులు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### ఎనగండ్ల గ్రామంలో

## ఎస్సీలకు రిజర్వేషన్ ఏదీ?

• 80 ఏళ్ల స్వాతంత్ర్యంలోనూ దక్కని రాజకీయ ప్రాతినిధ్యం
• ఎస్సీ సర్పంచ్, ఎంపీటీసీ రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతి



**కొల్చారం, సెప్టెంబర్ 03 (జనంసాక్షి):**
కొల్చారం మండలంలోని ఎనగండ్ల గ్రామంలో ఎస్సీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎస్సీ వర్గాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో ఎస్సీ సర్పంచ్ పదవికి, ఎంపీటీసీ స్థానానికి రిజర్వేషన్ కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.
స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, రాజ్యాంగం అమలులోకి వచ్చి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఎస్సీలకు స్థానిక సంస్థల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీల పట్ల వివక్ష ఎందుకు చూపుతున్నారో అర్థం కావడం లేదని అన్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు ఎంపీడీవో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు, మెమోరాండాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు న్యాయం జరగలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.
ఎనగండ్ల గ్రామంలోని సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించి తమకు న్యాయం చేయాలని వారు కమిషన్ చైర్మన్‌ను కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 10న చలో హైదరాబాద్ పెద్ద ఎత్తున సభ నిర్వహణ

- **ఉద్యోగులు తరలిరావాలి: టీజీ ఈజేఏసీ చైర్మన్ జగదీశ్వర్**



**మహబూబ్నగర్ అర్బన్ సెప్టెంబర్ 03(జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ నెల 10వ తేదీన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీజీ ఈజేఏసీ చైర్మన్ జగదీశ్వర్ తెలిపారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా సమీపంలో ఉన్న టీఎన్జీవో భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తగిన స్థాయిలో దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలు, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇప్పటికే పలు సందర్భాల్లో విజ్ఞప్తులు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి మరోసారి బలంగా తీసుకెళ్లేందుకు ఈ నెల 10న హైదరాబాద్‌లో భారీ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి **'చలో హైదరాబాద్'** కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగదీశ్వర్ కోరారు. ఉద్యోగుల ఐక్యతను చాటడంతో పాటు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, ఉద్యోగ వర్గాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చుతున్నాం

- **కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో ఆనందం**
- **రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్**



**మహబూబ్ నగర్ అర్బన్ సెప్టెంబర్ 03(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చుతున్నట్లు రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తో కలిసి కొత్వాల్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై మాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తూ దేశంలోనే ఉత్తమ పాలన అందిస్తున్నామని తెలిపారు. వెయ్యి రోజుల మచ్చలేని పాలనను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ ఆందోలనబాట చేపట్టిందని ఆరోపించారు. మహబూబ్ నగర్ పట్టణంలో మాజీ మంత్రి పెట్టిన ఫ్లెక్సీ ర్యాలీని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవాచేశారు. గత పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో సాగునీటి విషయాన్ని పూర్తిగా మరిచిపోయి ఈ జిల్లాను ఏడారిగా మార్చారని ఆరోపించారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ హయాంలో విధ్వంస పాలన కొనసాగిందని విమర్శించారు. తాగు, సాగునీరు, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు రూ. 1,72,000 కోట్లతో వ్యవసాయ రంగానికి ఊతమిచ్చిందని అన్నారు. 25 లక్షలమంది రైతులకు రూ. 20,617 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమచేసి రుణమాఫీ చేసినట్లు గుర్తుచేశారు. మా పాలనలో రైతులు ఆనందంగా ఉన్నారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర, బోనస్ ఇచ్చి రైతుల్లో మనోధైర్యాన్ని నింపినట్లు తెలిపారు. కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకం, కొల్లాపూర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి నిధులు విడుదల చేసినటు తెలిపారు. సీడ్ డెవలవ్ మెంట్ కార్పొరేషన్, ఆగ్రో ఇండస్ట్రీస్ వంటి మూతపడిన కార్పొరేషన్లను మళ్లీ బలోపేతం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు. సమావేశం లో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్ర కుమార్ గౌడ్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై గళమెత్తిన నవాబుపేట్ గులాబీ సైన్యం.??. నవాబ్‌పేటలో 'రైతు గర్జన' సభ



**నవాబ్‌పేట, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం 'రైతు గర్జన' సభను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ (గులాబీ సైన్యం) శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి గళమెత్తాయి. ఈ రైతు గర్జన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్చర్ల నియోజకవర్గ మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వందల రోజుల పాలనలో రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఇబ్బందులు పడుతున్న ప్రతి రైతుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం, వారికి మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గులాబీ శ్రేణులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# తన పొలంలో అక్రమంగా కంటైనర్ పెట్టారని ఫిర్యాదు

- **బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతు ఆరోపణ**



**తూప్రాన్ సెప్టెంబర్ 3(జనంసాక్షి):** మనోహరాబాద్ మండలం రామాయంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 132లో తన పట్టా వ్యవసాయ భూమిలోకి జక్కుల కిష్టయ్య, అతని అనుచరులు అక్రమంగా ప్రవేశించి అర్ధరాత్రి సమయంలో కంటైనర్ ఏర్పాటు చేశారని భూయజమాని జుట్టు సత్యనారాయణ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై 112కు ఫోన్ చేసి, మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జూలై 5, 2026 నుంచి కిష్టయ్య తన పొలంలోకి ప్రవేశించి కంటైనర్ ఏర్పాటు చేస్తానంటూ బెదిరిస్తున్నారని, అడ్డుకుంటే చంపేస్తానంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సత్యనారాయణ ఆరోపించారు. గతంలోనూ తనను చంపుతానని జర్నలిస్టు బెదిరించడంతో కేసు నమోదైందని పేర్కొన్నారు. తన పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన పట్టా భూమిలో ఎలాంటి హక్కు పత్రాలు లేకుండా అక్రమంగా ప్రవేశిస్తున్నారని, భూమాఫియా అండదండలతోనే ఈ వ్యవహారం జరుగుతోందని ఆయన ఆరోపించారు. పోలీసులపై కూడా ఒత్తిడి తెచ్చే విధంగా చేస్తానంటూ కిష్టయ్య చెప్పినట్లు సత్యనారాయణ తెలిపారు. గతంలో తనకు గుండెపోటు వచ్చిన పరిస్థితి కూడా ఉందని, ప్రస్తుతం జరుగుతున్న బెదిరింపులతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నానని చెప్పారు. జక్కుల కిష్టయ్య, అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను, రెవెన్యూ అధికారులను కోరారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి భరోసా

- **బాధిత కుటుంబానికి రూ.10,వేల ఆర్థిక సాయం..**



**మహమ్మదాబాద్, సెప్టెంబరు 03(జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన ఈనాడు పత్రిక రిపోర్టర్ సతీమణి,ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి,గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కుటుంబానికి రూ.10,వేల ఆర్థికసాయం అందజేశారు.ఈసందర్భంగా కొప్పుల మహేష్‌రెడ్డి,మాట్లాడుతూ..కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.బాధిత కుటుంబానికి తన సానుభూతిని వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.గోపాల్,మాజీ సర్పంచ్ పి.వెంకట్రాంరెడ్డి,మాజీ అధ్యక్షుడు బిక్షపతి,మాజీ సర్పంచ్ రాజయ్య, తిరుమల్‌రెడ్డి,పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వైద్యాధికారుల ఆకస్మిక దాడి

- **అనుమతులు లేని 8 క్లినిక్‌లు సీజ్ రెండు ల్యాబ్‌లకు ద జరిమానా**




**హత్నూర, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో పుట్టగొడుగుల్లా వెలిసిన పలు ప్రైవేట్ క్లినిక్ లపై గురువారం జిల్లా వైద్యాధికారులు ఒక్కసారిగా పంజా విసిరారు.మండల కేంద్రమైన హత్నూర,దౌల్తాబాద్ గ్రామాల్లో వెలిసిన క్లినిక్ లపై ఆకస్మికంగా దాడి చేసి అనుమతులు లేని 8 క్లినిక్ లను గుర్తించి వాటిని సీజ్ చేశారు. హత్నూరలో 4, దౌల్తాబాద్ లో 4 క్లినిక్‌లను సీజ్ చేయడంతో పాటు రెండు డయాగ్నొస్టిక్ సెంటర్ల నిర్వాహకులకు జరిమానా విధించారు. అధికారికంగా ఎలాంటి అనుమతులు లేకుండా క్లినిక్‌లు, వైద్య పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శశాంక్ దేశ్ పాండే హెచ్చరిక చేశారు.వారి వెంట వైద్యాధికారులు రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి: బీఆర్ఎస్



**తాడూర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు తాడూర్ మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ముందు బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. రైతులకు నిరంతరాయ విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు 24 గంటల సరఫరా అందించారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ సమస్యలతో పాటు రైతు భరోసా, మద్దతు ధర, బోనస్, యూరియా కొరత వంటి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించకుండా ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం సరికాదని, రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో రైతులు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, రమణ, సమ్మద్ పాషా, రాజుగౌడ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## డీ-7 కాలువకు నీరేది..రైతుల గోడు పట్టదా?

- రైతుల సమస్యలు పరిష్కరించాలి
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా



**బెజ్జంకి,సెప్టెంబర్ 3,(జనంసాక్షి):** వ్యవసాయ రంగం, నీటిపారుదల రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని,యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని,రైతు బీమా అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బెజ్జంకి మండల కేంద్రంలో రైతు ధర్నా,నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా డీ-7 కాలువకు తక్షణమే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు.యూరియా కొరతను నివారించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని,సాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు రైతు బీమాను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న,సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్ గుప్తా,ముక్కిస తిరుపతిరెడ్డి,కచ్చు రాజయ్య, ఎల శేఖర్‌బాబు,ఉప సర్పంచులు దుమాల మహేష్,యాలాల పరుశురాం,చింతలపల్లి సంజీవరెడ్డి,చెరుకూరి నరసయ్య,కొరివి తిరుపతి ముదిరాజ్,శేఖర్,తిరుపతి,మహేష్,పరశు రాములు,అంజిరెడ్డి,బాల్‌రెడ్డి,తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## లీకేజీ గుర్తింపు.. తక్షణ మరమ్మతులు

- నీటి వృథాకు చెక్.. ప్రజలకు అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా



**కోహిర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గొల్లబండ కాలనీలో మంచినీటి పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీని మున్సిపల్ సిబ్బంది తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టారు. వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో సిబ్బంది లీకేజీ ప్రాంతాన్ని గుర్తించి పైప్‌లైన్‌ను సరిచేయడంతో నీటి వృథాకు అడ్డుకట్ట పడింది. లీకేజీ కారణంగా రహదారిపై నీరు వృథాగా ప్రవహించడంతో పాటు స్థానికులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో మున్సిపల్ సిబ్బంది ఆలస్యం చేయకుండా మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే మున్సిపాలిటీ లక్ష్యమన్నారు. తాగునీటి పైప్‌లైన్‌లలో ఎక్కడైనా లీకేజీలు ఏర్పడితే వాటిని వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టేలా సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

నీటి ప్రతి చుక్క విలువైనదేనని, లీకేజీలను నిర్లక్ష్యం చేస్తే పెద్ద మొత్తంలో తాగునీరు వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో పైప్‌లైన్ లీకేజీలను గుర్తించిన వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు. ప్రజలు, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే నీటి వృథాను అరికట్టి పట్టణానికి మెరుగైన తాగునీటి సేవలు అందించవచ్చని చైర్మన్ పేర్కొన్నారు.

## ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌పరిధిలో 100 సీసీటీవీ కెమెరాల ప్రారంభోత్సవం

- నేరాల నియంత్రణకోసం నిఘ కెమెరాల ఏర్పాటు
- ముఖ్య అతిథులుగా హాజరైన శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ ఐపిఎస్, ఏసీపీ శ్రీనివాస్



**బొల్లారం, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌లో శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ ఐపిఎస్ చేతుల మీదుగా సీసీటీవీ నిఘా కెమెరాల ప్రారంభోత్సవం చేసారు.బొల్లారం సీఐ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చెసిన 100 సీసీటీవీ కెమెరాలను శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సిహెచ్ శ్రీనివాస్ ఐపిఎస్, రామచంద్రపురం ఏసీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజిపల్లి సీనియర్ నాయకులు గద్దె నర్సింహా,ఎస్ఐ అక్షిత, బొల్లారం ఇండస్ట్రీస్ అధ్యక్షులు ఆనంద్ రావ్, బొల్లారం ఇండస్ట్రీస్ ప్రధాన కార్యదర్శి రాయుడు,జాయ్ స్కూల్ యాజమాన్యం ప్రసాద్ రెడ్డి, సతీష్, ఎన్విఆర్ స్కూల్ యాజమాన్యం వెంకట్రావు, మైత్రి కన్స్ట్రక్షన్ కొండల్ రెడ్డి, హెడ్ క్వార్టర్ హోటల్ యాజమాన్యం శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేసులు వద్దు.. రికవరీ విధానమే ముద్దు



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజల ఆకలి తీర్చడంలో, ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి సివిల్ సప్లైస్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించడంలో రైస్ మిల్లర్ల పాత్ర కీలకమని మెదక్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోడుపునూరి చంద్రపాల్ అన్నారు. రైస్ మిల్లింగ్ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉన్నందున ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించి పరిశ్రమను కాపాడాలని కోరారు.

మెదక్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రపాల్‌తో పాటు పలువురు మిల్లర్లు మాట్లాడారు. కొంతమంది మిల్లర్లు చేసిన తప్పులు, అవకతవకలను ఆసరాగా చేసుకుని మొత్తం రైస్ మిల్లింగ్ రంగాన్ని అనుమానించడం సరికాదన్నారు. తప్పు చేసిన వారిపై వ్యక్తిగతంగా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిజాయితీగా పనిచేస్తున్న మిల్లర్లను వేధించవద్దని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం చేసిన వారిపై చర్యలకు తాము వ్యతిరేకం కాదని, అయితే అందరి మీద ఒకే విధంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. క్రిమినల్ కేసులు, వేధింపులకు బదులుగా ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం, బకాయిల రికవరీకి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రికవరీ ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలు కాపాడటంతో పాటు పరిశ్రమ కూడా కొనసాగుతుందని తెలిపారు.

తరుగు, డ్రైయేజ్, మిల్లింగ్ ఛార్జీల చెల్లింపులో జాప్యం వంటి సాంకేతిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ సప్లైస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మిల్లింగ్ రంగంపై వేలాది మంది కార్మికులు, రవాణా, అనుబంధ వర్గాల జీవనోపాధి ఆధారపడి ఉందన్నారు. రైస్ మిల్లర్లు ఐక్యంగా ఉండి పరిశ్రమ పరిరక్షణకు కృషి చేస్తామని చంద్రపాల్ తెలిపారు. సమావేశంలో వీరేశం, శ్రీనివాస్, శివకుమార్, రమేష్, జగదీష్, రాములు, నర్సింలు, వేణు, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ పనితీరుపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన




**కోహిర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** పాఠ్యపుస్తకాల్లో చదివే మున్సిపాలిటీ విధులు, పౌర సేవలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కోహిర్ ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులకు లభించింది. విద్యా సందర్శనలో భాగంగా గురువారం విద్యార్థులు కోహిర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు.

మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, గృహ నిర్మాణ అనుమతులు, జనన--మరణ ధృవపత్రాలు, ఆస్తి పన్నుల వసూలు, వ్యాపార లైసెన్సుల జారీ వంటి పౌర సేవలపై విద్యార్థులకు వివరించారు. ప్రజలు మున్సిపాలిటీని ఎప్పుడు, ఎందుకు సంప్రదించాలి, పన్నులు ఎందుకు చెల్లించాలి వంటి అంశాలను సులభంగా వివరించారు.

డంపింగ్ యార్డులో సేంద్రియ వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారీ విధానాన్ని కూడా విద్యార్థులకు చూపించారు. తడి, పొడి చెత్తను ఇంటివద్దే వేరు చేయడం, వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పట్టణ పరిశుభ్రతను మెరుగుపరచవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు, చెత్త నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు.

విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు చైర్మన్ సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్శన ద్వారా పుస్తక జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అనుభవం, సామాజిక బాధ్యతపై అవగాహన కలిగిందని అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పరిపాలన సంక్షేమ పథకాలు

- అన్ని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతాయి
- సంగారెడ్డి నియోజకవర్గం లో కాంగ్రెస్ నాయకుల భారీ బైక్ ర్యాలీ
- జెండా ఊపి ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి







సంగారెడ్డి సెప్టెంబర్ 3 (జనం సాక్షి) కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 1000 రోజులు పూర్తయిన సందర్భంగా సంగారెడ్డి నియోజకవర్గం లో కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కంది, కొండాపూర్ మండల కేంద్రాల్లో, సంగారెడ్డి పట్టణంలో డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి గురువారం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు.

సంగారెడ్డి పట్టణం లో రామ్ మందిర్ నుండి ప్రారంభమైన ర్యాలీ భవానీ మందిర్, నల్సాబ్ గడ్డ, రుక్మిణి థియేటర్, శాంతి నగర్ ల మీదుగా రాజంపేట, ఇందిరా నగర్, తార డిగ్రీ కాలేజ్, బైపాస్ రోడ్డు మీదుగా ఐబీ నెహ్రూ జంక్షన్ దాకా కొనసాగింది. ర్యాలీ పూర్తయిన అనంతరం ఐబీ జంక్షన్ వద్ద మాజీ ప్రధానులు నెహ్రూ, రాజీవ్ గాంధీ ల విగ్రహాలకు నిర్మలా జగ్గారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశం లో ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మొదలుపెట్టిందని అంతేకాకుండా కోటికి పైగా రేషన్ కార్డులు అందించదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మూడేళ్ల కాలం లో మహిళ సంక్షేమమే ధ్యేయంగా మహిళ కోసం ఉచిత బస్సు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. గత ప్రభుత్వం లో డబుల్ బెడ్ రూమ్ పథకం నామ్ కే వాస్తే గా సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని ఆనందం వ్యక్తంచేశారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ ప్రభు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, జార్జ్,మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్,నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, మహేష్,కంది సర్పంచ్ శ్రీరామ్, రమేష్, భూమేష్, ఫయాజ్, అన్వర్, సురేష్, కిరణ్, వంశీ,రవీందర్ నాయక్, శ్రీశైలం, ప్రశాంత్, రాజు గౌడ్, హరీష్, తాహెర్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుంటే నా ప్రాణం కానీ...

ఇప్పటికే ఆ కుంటను కబ్జా చేయడానికి కట్టను చదరం చేసిన విషయమై రెవెన్యూ పోలీసు అధికారులు సంయుక్తంగా కేసులు నమోదు చేయగా, మళ్ళీ కట్టను పున నిర్మించాలని బిజినపల్లి గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించారు. కానీ ఈ కుంటను కాపాడటానికి ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా దాని కట్ట తీసి చదరం చేసే బాధ్యత తనదేనని లోపాటింట్లో అధికార పార్టీ నాయకుడు బేరసారాలు పూర్తి చేసుకున్నాడు. ఈ విషయమై సదరు నాయకుడు బయానాగా రూ.20 లక్షలు కూడా తీసుకున్నట్లు కొందరు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీలో మనమే ఉన్నామని, పెద్ద సార్లకు నేను చెప్పేదే వేదమని, వాళ్ళు నా మాటనే వింటారు, అన్ని నేనే మేనేజ్ చేసుకొని మీకు అప్పగించే బాధ్యత నాదే అని ఒప్పందం చేసుకున్నారు. విడుతల వారీగా ఆ కుంటను ఖబ్జా చేయాలని ప్రణాళికలు చేసుకొని త్వరలో కార్యాచరణ మొదలు పెట్టబోతున్నారని పలువురి నోట గుసగుసలు వినబడుతున్నాయి.

ఈ కుంట కట్ట కబ్జాపై ఎన్నో పత్రికల్లో కథనాలు వస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. ప్రజల వినతులు పక్కన పడేసి అధికార పార్టీ నాయకుల తాయిలాలకు ఆశ పడి మీ పని మీరు చేసుకోండి, సమస్యలు రాకుండా చూసుకోండి అని పలు జాగ్రత్తలు చెప్తున్నారనే పలు విమర్శలు వస్తున్నాయి. అందుకు నిదర్శనమే జిల్లా అధికారులకు కట్టను పున నిర్మించాలని ప్రజలు వినతి పత్రం ఇచ్చినా, వారు ఇప్పటి వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా ఉండటమే కాకుండా, పున నిర్మించడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించినట్లు బహిరంగ ఆదేశాలు జారీ కాలేదు. అధికార పార్టీకి చెందిన నాయకుడు ప్రోద్బలం, సహకారంతో జుట్టయ్య కుంట కబ్జాకు ప్రయత్నాలు మొదలు పెట్టారని గ్రామ ప్రజలు దీనిని బట్టే అర్థం చేసుకొని చర్చించుకుంటున్నారు.

## నర్సరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్, లైసెన్స్ పొందాలి

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** జిల్లాలోని కూరగాయల నర్సరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని లైసెన్స్ పొందాలని జిల్లా ఉద్యాన అధికారి జి.రాజ్‌కుమార్ సూచించారు. జిల్లాలో సుమారు 30 కూరగాయల నర్సరీలు ఉన్నాయని తెలిపారు. గురువారం గద్వాల మండలంలోని పలు నర్సరీలను పరిశీలించి నిర్వహణ, మొక్కల నాణ్యత, రిజిస్ట్రేషన్, లైసెన్స్ వివరాలను తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా నాసిరకం నారు, మొక్కలు విక్రయించడం, రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం వంటి ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ చట్టం-2010, తెలంగాణ ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్ రూల్స్-2017 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన, చీడపీడలు లేని నారు, పండ్లు, పూల మొక్కలు అందించడమే నర్సరీ చట్టం ఉద్దేశ్యమన్నారు. షేడ్‌నెట్



నర్సరీలు, ప్రోట్రేలలో శాస్త్రీయ పద్ధతుల్లో నారు ఉత్పత్తి చేయాలని సూచించారు. రైతులు మొక్కలు, నారు కొనుగోలు చేసేటప్పుడు రిజిస్ట్రేషన్, లైసెన్స్ ఉన్న నర్సరీలనే ఎంచుకుని తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ఎం. రాజశేఖర్, నర్సరీ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

# హామీల వర్షం.. అమలుకు కరువు!

- సంక్షేమ పథకాలపై సందిగ్ధత.. పేదల ఆశలు ఆవిరి





**కోహీర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత లేకపోవడంతో కోహీర్ మండలంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అయోమయం నెలకొంది. ఆరు గ్యారెంటీలు, ఇతర సంక్షేమ పథకాలు తమ జీవి తాల్లో మార్పు తీసుకొస్తాయని ఆశించిన ప్రజలు.. ప్రస్తుతం వాటి అమలు, నిధుల విడుదల, అర్హతలపై స్పష్టత కోసం ఎదురుచూస్తు న్నారు. ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలపై మార్పులు, కోతల ప్రచారం కూడా లబ్ధిదారుల్లో ఆందోళనకు కారణమవుతోంది.

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై ఉత్కంఠ...**

పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై లబ్ధిదారులు స్పష్టత కోరు తున్నారు. దరఖాస్తులు ఎప్పుడు పరిష్కారమవుతాయి, సాయం ఎప్పు డు అందుతుంది, పథకం భవిష్యత్ ఏమిటనే ప్రశ్నలు ఎదురవు తున్నాయి. పెళ్లి తేదీలు దగ్గరపడుతున్న కొద్దీ ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూసే కుటుంబాల్లో ఆందోళన పెరుగుతోంది.

**పింఛన్ల కోసం ఎదురుచూపులు...**

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నెలవారీ పింఛన్ జీవనాధారంగా ఉంది. పింఛన్ల పెంపు, కొత్త పింఛన్ల మంజూరు, అర్హుల ఎంపికపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్లు ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

**రైతు భరోసాపై ఆశలు...**

పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందడం అవసరం. రైతు భరోసా చెల్లింపుల్లో జాప్యం, రైతుబీమా కొనసాగింపు, అర్హతలపై స్పష్టత లేకపోవడం రైతుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. పంట చేతికొచ్చే వరకు ప్రభుత్వ భరోసా అవసరమని రైతులు కోరుతున్నారు.

**రేషన్‌కార్డుల కోసం నిరీక్షణ...**

కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులైన పేద కుటుంబాలు ఎదురుచూస్తు న్నాయి. రేషన్‌కార్డుతో బియ్యంతో పాటు పలు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉండటంతో ప్రజల్లో ఆసక్తి నెల కొంది. అర్హతల పరిశీలనలో అనర్హుల తొలగింపు ప్రక్రియపై కొందరు లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నిజమైన అర్హులను గుర్తిం చేలా పారదర్శకంగా పరిశీలన జరపాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇందిరమ్మ ఇళ్లకు నిధులే కీలకం...**

సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకంపై పేదలు ఆశలు పెట్టుకున్నారు. నిర్మాణ సామగ్రి, కూలీల ధరలు పెరగడంతో లబ్ధిదారులపై అదనపు భారం పడుతోంది. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన వారికి బిల్లులు సకాలంలో విడుదల చేయాలని, విడతల వారీగా నిధులు అందించాలని కోరుతున్నారు.

**ప్రకటనలు కాదు.. అమలు కావాలి...**

యువత, మహిళలు, పేద కుటుంబాల కోసం ప్రకటించిన పథకాలకు నిధులు కేటాయించి, స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసి అర్హు లకు సకాలంలో ప్రయోజనం అందించాలని ప్రజలు కోరుతున్నారు. పథకాలను ప్రకటించడం కంటే వాటిని అర్హుల గడపకు చేర్చడమే ముఖ్యమని పేర్కొంటున్నారు.

**సందిగ్ధతకు తెరదించాలి...**

ఏ పథకం కొనసాగుతుంది? ఎవరు అర్హులు? పెండింగ్ దరఖాస్తుల పరిస్థితి ఏమిటి? నిధులు ఎప్పుడు విడుదలవుతాయి? వంటి అంశా లపై ప్రభుత్వం అధికారికంగా స్పష్టత ఇవ్వాలని కోహీర్ మండల ప్రజలు కోరుతున్నారు. సంక్షేమ పథకాలపై ఆధారపడే కుటుంబాలకు నిరంతర భరోసా కల్పించడంతో పాటు, హామీలను నిర్ణీత సమయం లో అమలుచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### మోసపూరిత హామీలతో

## ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ సర్కార్




**బిజినేపల్లి, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల రైతు సమితి అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ కేంద్రం ముట్టడి నిర్వహించారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్, రైతు బీమా, రైతుబంధు, పెన్షన్లు, బోనస్, యూరియా, కొనుగోలు కేంద్రాలు వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కౌలు రైతులను కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు వీహెచ్‌పి ఆవిర్భావ దినోత్సవం

**నారాయణపేట సెప్టెంబర్ 3(జనంసాక్షి):** విశ్వహిందూ పరిషత్ 63వఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 4న జిల్లా మొత్తంలో, నగరం లోఅన్ని గ్రామ సమితిలో, హిందూ బంధువులందరినీ కలుపుకుని కాషాయం జెండా ఎగరవేసి స్థాపన దివస్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు మురళి భట్టాడ్, కార్యదర్శి కడదా సు ప్రవీణ్ కుమార్, బజ రంగ్దళ్ సంయోజకులు వద్ద శ్రావణ్ కుమార్, మిస్సిన్ సందీప్, బజరంగ్దళ్ నగర అధ్యక్షులు నీరటి వెంకటేష్, రవికుమార్ గౌడ్ చెన్నా రెడ్డి ,సంపంగి కృష్ణ సత్యా, గిరీష్ ఆకాష్ చక్రి అనిల్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ సందర్శించిన డీఆర్డీఓ



**మల్లకల్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ పర్యవేక్షణలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా డీఆర్డీఓ ముషాయిదా బేగం గురువారం మల్లకల్ మండల కేంద్రంలోని పియం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, విద్యార్థుల్లో మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించడం వంటి అంశాల ప్రాధాన్యతను ఈ సందర్భంగా వివరించారు.

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా,పచ్చదనంతో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బోధన పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

- కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ అబ్దుల్ రహీం



**ఉర్కొండ, సెప్టెంబర్ 03, (జనంసాక్షి);** ఊరుకొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను మండల విద్యాధికారి (ఎంఈఓ)అబ్దుల్ రహీం తనిఖీ చేశారు.

గురువారం పాఠశాలను సందర్శించిన ఎంఈఓ.. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, వసతి సౌకర్యాలు, విద్యా బోధన తీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సమానత్వం కోసం

## దుస్తుల పంపిణీ : MEO విజయభాస్కర్

- పాఠశాలలో ఉచిత యూనిఫాం, బూట్లు,బెల్ట్ , ఐడి కార్డుల పంపిణీ

**కేటీ దొడ్డి సెప్టెంబర్ 03(జనంసాక్షి):** పీఎం శ్రీ ఎంపిహెచ్ఎస్ కుచినెర్ల పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ఏకరూప దుస్తుల, బూట్లు,బెల్టు,ఐడి కార్డును మండల విద్యాధికారి విజయభాస్కర్ ,ప్రధానోపాధ్యాయులు మహేష్ ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల నిర్వహణ కమిటీ (SMC) ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయభాస్కర్ , ఉపాధ్యాయులు మహేష్, గోపీనాథ్ గౌడ్, రాజశేఖర్, ఎస్తేర్ రాణి, అసిమా బేగం, నజియా బేగం, నరేష్,మాధవి , అభ్రేష్, రంగప్ప ,భీమేష్,నరసింహ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.